సాక్షి నిజామాబాద్

బుధవారం ∣ 17 ∣ జనవరి ∣ 2024



మరుగున ప్లాస్టిక్ కేంద్రాలు..

గత ప్రభుత్వం ప్లాస్టిక్‌ను రిసైక్లింగ్ చేసేందుకు జీపీల్లో యూనిట్లు కేటాయించగా ప్రస్తుతం అవి మరుగున పడ్డాయి.

- 8లో ▸



శివాలయంలో జడ్జి పూజలు

ఆర్మూర్ నవనాథ సిద్దుల గుట్టపై జిల్లా జడ్జి సునీత కుంచాల సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5 /17.7

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత ఉంటుంది. సాయంత్రం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాసరలో కమిషనర్ పూజలు



నిజామాబాద్‌నాగారం: నిర్మల్ జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని మంగళవారం నిజామాబాద్ మున్సిపల్ కమిషనరల్ మంద మకరందు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. కమిషనర్ కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు బాలకృష్ణ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

29న అవిశ్వాస సమావేశం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై ఎంపీటీసీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై ఈనెల 29న సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు ఒక ప్రకటలనో తెలిపారు. ఈ నెల 8న నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర ప్రసాద్‌కు 17మంది ఎంపీటీసీలకు గాను 12మంది ఎంపీటీసీలు సంతకాలు చేసి అవిశ్వాస తీర్మానం లేఖ అందజేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎంపీపీగా గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్య, వైస్ ఎంపీపీగా కులాచారి శ్యాంరావు కొనసాగుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు తొమ్మిది మంది సభ్యులు (మెజారిటీ) ఉండటంతో వారు అవిశ్వాస తీర్మానం పెట్టారు.

దరఖాస్తుల గడువు పొడగింపు

డిచ్‌పల్లి: తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2024–2025 ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించినట్లు ధర్మారం(బి) తెలంగాణా సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్, జి ల్లా కోఆర్డినేటర్ సంగీత ఒక ప్రకటనలో తె లి పారు. దరఖాస్తుల గడువు 15న ముగియగా, ఉన్నతాధికారులు 20 వరకు పొడగించినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 4న పరీక్ష ఉంటుందన్నారు.

నేడు సాలూర ఎత్తిపోతల పథకం పున:ప్రారంభం

బోధన్: సాలూర మండల శివారులోని మంజీర నదిపై నిర్మించిన సాలూర ఎత్తిపోతల పథకాన్ని బుధవారం పున:ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. నాలుగు నెలల క్రితం గుర్తు తెలియని ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి తీగలు, ఆయిల్ అపహరించారు. స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు నోచుకుంది.

పొగమంచుతో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



గాంధారి(ఎల్లారెడ్డి): పొగ మంచు కారణంగా మంగళవారం ఉదయం గాంధారి మండలం గుడిమెట్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును వెంటనే నిలిపి వేయగా రోడ్డు పక్కన ఒరిగింది. దీంతో ప్రమాదం తప్పింది. బాన్సువాడ నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. బస్సులో సుమారు పది మంది ప్రయాణికులుండగా అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు రాలేదన్నారు.

ఏడుగురి రిమాండ్


కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి శివారులో ఉన్న ఓ అడ్డాలో ద్రవరూప గంజాయి డబ్బాలను విక్రయిస్తున్న ముఠాను ఆదివారం సాయంత్రం రూరల్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు కొనుగోలు చేస్తున్న ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పై తెలిపారు. వీరి వద్ద నుంచి ఖరీదైన మూడు కార్లు, ఓ బైక్, రెండు స్కూటీలు, 7 సెల్ ఫోన్లు, 190 గ్రాముల ఆయిల్ గంజాయి డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. ఈగంజాయి విలువ రూ. 97,500 ఉంటుందన్నారు.

అరకు నుంచి సరఫరా

కేసు విచారిస్తున్న పోలీసులు విశాఖపట్నం దగ్గరలోని అరకు ప్రాంతం నుంచి ద్రవ రూపంలో(ఆయిల్) గంజాయిని సిద్ధం చేసి డబ్బాల్లో నింపి కామారెడ్డికి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ద్రవరూపంలో(ఆయిల్) తయారు చేస్తే ఎవరికీ అనుమానం రాకుండా ఉంటుందని.. అరకు ప్రాంతంలో ఇటీవల ఈ విధంగా తయారు చేస్తున్నారని తేలింది.

ఆగని ఆగడాలు

- బెదిరింపులకు గురిచేస్తున్న జీవన్‌రెడ్డి అనుచరులు !
- చంపేస్తామని యువకుడికి హెచ్చరిక ఫోన్లు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో
- మరోవైపు మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై అంకాపూర్ గ్రామస్తుల ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అధికారంలో ఉన్న సమయంలో ఇష్టారీతిన అరాచకాలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అనుచరులు ఇప్పటికీ మారలేదనే విమర్శలు వస్తున్నాయి. తమను ఎవరూ ఏమీ చేయలేరంటూ పలువురిని బెదిరింపులకు గురిచేస్తుండడం గమనార్హం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పలువురిపై హత్యాయత్నాలు చేసినప్పటికీ పోలీసులు కేసులు నమోదు చేయకుండా మేనేజ్ చేసుకున్న వీళ్లు, ఇప్పుడు సైతం తమకు ఎదురు లేదన్నవిధంగా విచ్చలవిడిగా ప్రవర్తిస్తుండడం విశేషం. గతంలో లక్కంపల్లి మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను హత్య చేసేందుకు బీహార్ ముఠాకు సుపారీ ఇచ్చి పోలీసులకు పట్టుబడిన సర్పంచ్ భర్త మహేందర్ ఇప్పటికీ పద్ధతి మార్చుకోకపోవడం గమనార్హం. పోలీసులకు పట్టుబడిన సమయంలో భారీగా గంజాయి లభించినప్పటికీ గంజాయి దాచిపెట్టి కేసు తీవ్రత తగ్గించేలా జీవన్‌రెడ్డి ఒత్తిడి చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. మరోవైపు మహేందర్, మాక్లూర్ సొసైటీ చైర్‌పర్సన్ కుమారుడు గోపు రంజిత్ కలిసి గతంలో పోశెట్టిపై హత్యాయత్నం సైతం చేశారు. ఈ విషయమై సీసీ ఫుటేజీలు ఉన్నప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకుండా జీవన్‌రెడ్డి ప్రభావితం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గంలో విచ్చలవిడిగా గంజాయి రిటైల్ అమ్మకాలు జరుగుతున్నాయి. తాజాగా లక్కంపల్లికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా మహేందర్ సతాయిస్తున్నాడని తెలుస్తోంది. పైగా ఇంటర్‌నెట్ యాప్ ద్వారా ఫోన్ చేసి వేరే వ్యక్తులతో మాట్లాడించి చంపేస్తామని బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో బాధితుడు రాజశేఖర్ పోలీసులకు ఈ నెల 12న ఫిర్యాదు చేశాడు. ఒడిశా రాష్ట్రంలోని ఫేక్ అడ్రస్ చూపిస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. తనకు హాని జరిగితే పోలీసులదే బాధ్యత అని రాజశేఖర్ చెబుతున్నాడు. పలువురికి ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకపోగా, మహేందర్ తాజాగా నాందేడ్ ప్రాంతానికి చెందిన 30 మంది వ్యక్తులను తీసుకొచ్చి నందిపేటలో హల్‌చల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం పట్ల పలువురు 'సాక్షి'కి తెలిపారు.

జీవన్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే..

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అంకాపూర్ గ్రామస్తులు సోమవారం విలేకరుల సమావేశంలో హెచ్చరికలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని గతంలో గ్రామస్తులందరూ చెట్టుకు కట్టేసి కొట్టినట్లు జీవన్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేసి, గ్రామ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడాడని, దీన్ని ఖండిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి క్షమాపణలు చెప్పకపోతే జీవన్‌రెడ్డి ఇంటిని ముట్టడించడంతో పాటు గ్రామంలో తిరగనివ్వమన్నారు. ఇదిలా ఉండగా జీవన్‌రెడ్డి దుబాయ్ నుంచి తనకు యాప్ ద్వారా బెదిరింపు కాల్స్ చేయించినట్లు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఇటీవల చెప్పిన విషయం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు మాత్రం ఇప్పటికీ జీవన్‌రెడ్డి, అతని అనుచరులు పద్ధతి మార్చుకోలేదని వ్యాఖ్యానిస్తున్నారు.



అంకాపూర్‌లో మాట్లాడుతున్న గ్రామస్తులు

సంబురంగా సంక్రాంతి



డిచ్‌పల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

సంక్రాంతి సంబురాలను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నాపెద్దా గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. – డిచ్‌పల్లి, సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నగరంలో పతంగి ఎగురవేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

అర్బన్‌లో షాడో ఎమ్మెల్యే..!

- ప్రజాప్రతినిధి పేరుతో అధికారులకు దమ్కీలు
- బెంబేలెత్తిపోతున్న బల్దియా సిబ్బంది



సుభాష్‌నగర్ : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ఎమ్మెల్యే పీఏ (ప్రైవేట్ వ్యక్తి) పేరుతో మున్సిపాలిటీలోని పలు విభాగాలు, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి దమ్కీలు ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏకంగా మున్సిపల్ కమిషనర్‌కే ఎమ్మెల్యే పేరు చెప్పి ఇల్లీగల్ పనుల్లో జోక్యం చేసుకుంటున్నాడనే విమర్శలొస్తున్నాయి. అర్బన్ ఎమ్మెల్యేగా ధన్‌పాల్ సూర్యనారాయణ గెలిచి నెల రోజులు గడవక ముందే షాడో ఎమ్మెల్యే ఈ స్థాయిలో రెచ్చిపోతే.. రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు.

ఆయన ఫోన్ వస్తే హడల్..

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా ధన్‌పాల్ సూర్యనారాయణ గెలిచిన తర్వాత సదరు పీఏ షాడో ఎమ్మెల్యేగా అవతారమెత్తాడు. ఎమ్మెల్యే కాక ముందు కూడా ఆయన పీఏ, పీఆర్వోగా అతడు వ్యవహరించాడు. గతంలోనూ ఈ పీఏ వ్యవహార శైలి ఇలాగే ఉండేదని పార్టీలోని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ధన్‌పాల్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మున్సిపాలిటీ, ఇతర శాఖల అధికారులను బెదిరిస్తూ షాడో ఎమ్మెల్యేగా మారాడు. పార్టీ నాయకులు, కార్పొరేటర్లతోనూ సదరు షాడో ఎమ్మెల్యేకు సఖ్యత లేదని పార్టీలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మున్సిపాలిటీలో ఆ పీఏ ఫోన్ వస్తే అధికారులు, సిబ్బంది హడలెత్తిపోతున్నారు.

కాగా ఈ తతంగమంతా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు తెలియకుండానే జరుగుతోందనే అభిప్రాయం అటు అధికారుల్లో.. ఇటు పార్టీ నాయకుల్లో వ్యక్తమౌతోంది.

మీరు డాక్టరా.. ఇంజినీరా..?

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై కలెక్టర్ సీరియస్..!
- ఆస్పత్రిలో టెండర్లు లేకుండా పనులు చేయించడంపై అసహనం
- మీరే పనులు చేయిస్తే 'టీఎస్ఎంఎస్ఐడీసీ' ఉన్నదెందుకు..!
- నిలిచిన రూ. 85 లక్షల పనులు



నిజామాబాద్ నాగారం : జీజీహెచ్ సూపరింటెండెంట్ అంటే వైద్యమే చేయాలి.. కాని ఆ పని వదిలేసి ఇంజినీర్ అవతారమెత్తడంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమయ్యాయి. చివరకు ఈ అడ్డగోలు అభివృద్ధి పనుల వ్యవహారం కలెక్టర్ వరకు వెళ్లడంతో సదరు జీజీహెచ్ ఉన్నతాధికారిపై ఆయన సీరియస్ అయ్యారు. జీజీహెచ్‌లో రూ. 85 లక్షల పనులు చేయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ వద్దకు ఫైల్ తీసుకొని వెళ్లడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మీరే పనులు చేయిస్తే ఇంజినీరింగ్ శాఖ ఉండి ఎందుకుని ఆయన సీరియస్ అయినట్లు తెలిసింది.

గుట్టు చప్పుడు కాకుండా..

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండానే అభివృద్ధి పేరుతో పనులు కానిచ్చేస్తున్నారు. అంతా తానే అయ్యి అభివృద్ధి పేరుతో పనులు చేయించడం.. లక్షల్లో నిధులు గోల్‌మాల్ కావడం సర్వసాధారమైపోయిందని సిబ్బంది గుసగుసలాడుతున్నారు. తాజాగా ఇటీవల సుమారు రూ. 85 లక్షలతో జీజీహెచ్‌లో మరమ్మతులు చేయించడానికి సదరు ఉన్నతాధికారి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇంకేముంది కలెక్టర్ వద్దకు వెళ్లి ఆ పనులకు సంబంధించి అనుమతివ్వాలని కోరారు. ఫైల్‌ను పరిశీలించిన కలెక్టర్ జీజీహెచ్‌లో అసలేం జరుగుతోందని సీరియస్ అయ్యారు. జీజీహెచ్‌కు ప్రత్యేకంగా ఇంజినీరింగ్‌శాఖ టీఎస్ఎంఎస్ఐడీసీ (తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) ఉందని, ఏమైనా పనులు, నిర్మాణాలు, మరమ్మతులుంటే ఆ శాఖ ద్వారానే చేయించుకోవాలి కదా అని ప్రశ్నించారు. కాని సదరు జీజీహెచ్ ఉన్నతాధికారి మాట్లాడుతూ గతంలో కలెక్టర్ అనుమతితో పనులు చేయించామని పేర్కొనగా, అప్పట్లో ఏం జరిగిందో తనకు సంబంధం లేదని, నియమనిబంధనలు పాటించాల్సిందేనన్నారు. జీజీహెచ్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు కావాలో టీఎస్ఎంఎస్ఐడీసీ శాఖ ద్వారానే చేయించుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు.

ప్రైవేట్ వ్యక్తులతో పనులెందుకు..?

జీజీహెచ్‌లో టీఎస్ఎంఎస్ఐడీసీ శాఖకు ఎలాంటి సంబంధం లేకుండానే ఐదుగురు ముఖ్యమైన వ్యక్తులు అభివృద్ధి పనుల పేరుతో రూ.లక్షల నిధులు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. పనులు చేసినట్లు చూపుతూ బిల్లులు పెట్టి ఇష్టారాజ్యంగా ప్రభుత్వ సొమ్ములను అప్పనంగా మింగేస్తున్నట్లు తెలిసింది. తాజాగా కలెక్టర్‌తో సదరు జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఓ అభివృద్ధి పనికి రూ. 2 లక్షలు అవసరముండగా తాను రూ. 90వేలకే చేయిస్తానని చెప్పగా, ప్రైవేట్ వ్యక్తులు అసలు పనులు చేయించడమేంటని కలెక్టర్ సీరియస్ అయినట్లు సమాచారం.

ఏదైనా ఉంటే టీఎస్ఎంఎస్ఐడీసీ, డీఎంఈ అనుమతితో టెండర్ ద్వారా పనులు చేయించుకోవాలి. వాళ్లు ఐటీతో పాటు జీఎస్టీ కూడా కడతారు. భవిష్యత్తులో ఏదైనా జరిగినా వారే బాధ్యత వహిస్తారు కదా ఆయన సూచించినట్లు తెలిసింది. దీంతో జీజీహెచ్‌లో రూ. 85లక్షల పనులు టెండర్ ప్రక్రియ ద్వారా జరగనున్నాయి.

టెండర్ ప్రకారమే పనులు

జీజీహెచ్‌లో సుమారు రూ. 85లక్షలకు సంబంధించిన పనులు టెండర్‌ప్రక్రియ నిర్వహించాం. కలెక్టర్ అనుమతితో అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. జీజీహెచ్‌లో ఏ పని జరగాలన్నా ఖచ్చితంగా టెండర్ ప్రకారం చేయాలి. ఇందుకోసం టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా కలెక్టర్ అనుమతితో టెండర్ నిర్వహించి పనులు చేపట్టాలి. రూ. 1 లక్ష దాటితే టెండర్ ద్వారానే పనులు చేయాల్సి ఉంటుంది. సుమారు రెండున్నరేళ్లలో జీజీహెచ్‌లో టెండర్ ప్రక్రియ లేకుండానే పనులు చేస్తున్నారు.

– ప్రవీణ్, ఏఈ, టీఎస్ఎంఎస్ఐడీసీ

టెండరా.. అదేంటి..?

జిల్లా కేంద్రానికి 2022 జూన్ 18న అప్పటి వైద్యారోగ్యశాఖమంత్రి హరీష్‌రావు రావడానికి సరిగ్గా పక్షం రోజుల ముందు జీజీహెచ్‌లో సుమారు రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో రేకుల షెడ్డు నిర్మాణం అంటూ రూ. 20లక్షల వరకు వెచ్చించినట్లు చెబుతున్నారు. మిగితా డబ్బులతో అక్కడక్కడా చిన్నచిన్న మరమ్మతులు చేసి మమ అనిపించారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. జీజీహెచ్‌లో ఎలాంటి పనులు చేపట్టాలన్నా టీఎస్ఎంఎస్ఐడీసీ సంస్థ ద్వారానే టెండర్ ద్వారా నిర్వహించాలి.



జీజీహెచ్‌లో టెండర్ లేకుండానే నిర్మించిన షెడ్

రూ. లక్ష నుంచి ఎన్ని కోట్ల పనులైనా టెండర్ ద్వారా చేపట్టాలి. డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) అనుమతి కూడా తప్పనిసరి. కాని రెండున్నరేళ్లలో ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. గంగాస్థాన్‌లో ఉండే టీఎస్ఎంఎస్ఐడీసీ శాఖ అనుమతి లేకుండానే పనులు జరిగాయి.

త్వరలో రైల్వేగేట్ మూసివేత..!

నిజామాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మాధవనగర్ రైల్వేగేట్‌ను నెల రోజుల పాటు మూసివేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు నెల రోజుల పాటు గేటు మూసివేయాలని అధికార వర్గాలు నిర్ణయించినట్లు తెలిసింది.



మాధవనగర్ వద్ద రైల్వేగేట్

సజ్జకు రికార్డు స్థాయిలో ధర

- క్వింటాలుకు రూ. 7,400 చెల్లింపునకు ఒప్పందం చేసుకుంటున్న వ్యాపారులు
- గతంలో ఎప్పుడూ ఈ ధర లేదంటున్న రైతులు

బాల్కొండ: సజ్జ పంటకు ప్రస్తుత సంవత్సరం రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. క్వింటాలుకు రూ.7,400 ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామస్తులు వ్యాపారులతో ఒప్పందం చేసుకున్నారు. సజ్జ సాగు మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు గరిష్టంగా క్వింటాలుకు రూ. 5 వేలు మాత్రమే ధర పలికింది. ఈ యేడాది ఊహించని డిమాండ్ ఏర్పడింది. క్వింటాలుకు సజ్జ ధర రూ.10 వేలకు పెరిగినా ఆశ్చర్య పోనక్కర్లేదని రైతులు అంటున్నారు. పసుపు పంటను సాగు చేసిన నేలల్లోనే అధికంగా సజ్జ సాగు చేస్తారు. ఈసారి పసుపు సాగు విస్తీర్ణం తగ్గినందున సజ్జ సైతం తగ్గుతుంది. దీంతో సజ్జకు డిమాండ్ పెరిగిందని రైతులు చెబుతున్నారు.



వేంపల్లిలో సజ్జపంట

దిగుబడికి గ్యారంటీ..

సజ్జ పంట ధర పెరగడమే కాకుండా, దిగుబడి కూడ గ్యారంటీగా ముందే రాసిస్తున్నారు. ఎకరానికి 11 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యాపారులు ముందస్తుగానే రైతులతో ఒప్పందం చేసుకుంటున్నారు. అంతకంటే తక్కువ దిగుబడి వస్తే ఎకరానికి 11 క్వింటాళ్ల ధర చెల్లించుటకు ఒప్పందం చేసుకుంటున్నారు. పంట విక్రయించిన పది రోజుల్లో డబ్బుల చెల్లింపు ఉంటుంది.

ఆంధ్ర, కర్ణాటక వ్యాపారులు..

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల్లో సకాలంలో వర్షాలు కురువనందున ప్రస్తుత సంవత్సరం అంతగా సజ్జ సాగు కాలేదు. దీంతో అక్కడి వ్యాపారులు, ఇక్కడి వ్యాపారులతో ఒప్పందం చేసుకుని సజ్జ పంట సాగుకు విత్తనాలను సరఫరా చేస్తున్నారు. సజ్జపంటను మన ప్రాంతం లోయాసంగి ఆఖరుపంటగా సాగు చేస్తారు. ఫిబ్రవరి 20 వరకు పంటను విత్తవచ్చు. సజ్జ పంట వాణిజ్య పంట కావడంతో వ్యాపారులు రైతులతో ముందస్తుగానే ఒప్పందం చేసుకుంటారు. ఉత్తర భారతంలో ఎక్కువగా సజ్జ పంటను ఆహారానికి వినియోగిస్తారు.

సైబర్ వల.. జనం విలవిల

డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌కు చెందిన ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆరు గ్యారంటీలు రావాలంటే ఓటీపీ చెప్పాలని నమ్మబలికారు. ఆమె ఓటీపీ చెప్పగానే బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.10 వేలు కట్ అయ్యాయి.

నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆన్‌లైన్‌లో షాపింగ్ చేశాడు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఆర్డర్ రావాలంటే ఓటీపీ చెప్పాలన్నారు. దీంతో ఆయన చెప్పగానే అకౌంట్‌లో నుంచి డబ్బులు మాయం అయ్యాయి.

- ప్రజల ఆశను క్యాష్ చేసుకుంటున్న సైబర్ కేటుగాళ్లు
- రోజురోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- 'ఆరు గ్యారంటీలు' రావాలంటే ఓటీపీ చెప్పాలంటూ టోకరా



ఖలీల్‌వాడి: రోజు రోజుకు ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. మాయ మాటలతో నమ్మించి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. విద్యావంతులు, ఉద్యోగులు వీరి వలలో పడి మోసపోతుండటం గమనార్హం. రోజురోజుకు కొత్త విధానం ద్వారా ప్రజలను లూటీ చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్ మోసగాళ్ల పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. మరోవైపు మోసపోయిన వారి డబ్బులు ఎటుపోతున్నాయో కూడా పోలీసులు కనుగోలేకపోతున్నారు. జిల్లాలో సైబర్ నేరాల ఫిర్యాదుల్లో 30 శాతం కూడా రికవరీ కాలేదని విమర్శలు ఉన్నాయి. వెంటనే ఫిర్యాదు చేసిన సందర్భాల్లో మాత్రం డబ్బులు కట్ కాకుండా ఫ్రీజ్ చేస్తున్నారు.

పెరిగిన కేసులు

జిల్లాలో సైబర్ కేసులు పెరిగాయి. 2022లో 192 కేసులు నమోదు కాగా.. 2023లో 294 కేసులు నమోదు అయినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు చదువుకున్న వారు, ఉద్యోగాలు చేసే వారు సైబర్ కేటుగాళ్లకు చిక్కుతున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే మోసపూరిత ప్రకటనలు నమ్మి వారి బారిన పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆ దరఖాస్తుల్లో తప్పులున్నాయని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారు.

జిల్లాలో నమోదైన సైబర్ కేసులు

సంవత్సరం	కేసులు
2021	43
2022	192
2023	294

ఓటీపీ చెప్పొద్దు



బ్యాంక్ సంబంధిత వివరాలు ఎవరికి చెప్పవద్దు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దు. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఆరు గ్యారంటీల కోసం ఎవరు కూడా ఓటీపీలు అడగరు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– నరహరి, టౌన్ సీఐ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్‌: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ అండర్‌–14 పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ దుర్గారెడ్డి మంగళవారం తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విష్ణు, జశ్వంత్‌ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 17 నుంచి 18 వరకు ఆర్మూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను వైస్‌ ప్రిన్సిపాల్‌ సంధ్యారాణి, శ్రీధర్‌, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్‌ అభినందించారు.

శివాలయంలో జిల్లా జడ్జి పూజలు



ఆర్మూర్‌టౌన్‌: నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జడ్జితో పాటు ఆర్మూర్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి వేముల దీప్తి, జిల్లా అదనపు డీసీపీ జయరాం సైతం ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వయం భూ శివలింగానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. పవిత్రమైన సిద్ధుల గుట్ట మహత్యం కలదని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు న్యాయమూర్తులు, పోలీస్‌ అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ సూపరింటెండెంట్‌ పురుషోత్తంగౌడ్‌, సీనియర్‌ న్యాయవాదులు శ్రీనివాస్‌ ఖాందేశ్‌, న్యాయాధికారులు, న్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

■ చిన్నారులపై దాడి, ఇద్దరికి గాయాలు

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో సోమవారం కుక్కలు స్వైర విహారం చేశాయి. హౌజింగ్‌ బోర్డు కాలనీలో రోడ్డు పక్కన ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. మున్సిపల్‌ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులతో పాటు స్థానిక కౌన్సిలర్‌ బూక్యా రాజు డిమాండ్‌ చేశారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

మాక్లూర్‌: మండల కేంద్రంలో పలు చోట్ల దాడులు నిర్వహించి 40 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌రావు మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు మండల కేంద్రంలోని పలు చోట్ల దాడులు నిర్వహించగా పీడీఎస్‌ బియ్యం విక్రయిస్తున్న అలీం, మొబీన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అంజయ్య, అజయ్‌బాబు పాల్గొన్నారు.

మరుగున ప్లాస్టిక్‌ సేకరణ కేంద్రాలు

- రీసైక్లింగ్‌కు చర్యలు తీసుకోవాలని నిర్ణయించిన గత ప్రభుత్వం
- ప్రతి జీపీలో ప్లాస్టిక్‌ సేకరణ కేంద్రాల ఏర్పాటు
- ఆగిపోవడానికి నిర్వహణ లోపమే ప్రధాన కారణం



మోర్తాడ్‌లో ప్లాస్టిక్‌ సేకరణ కేంద్రం (ఫైల్‌)

మోర్తాడ్‌: ప్లాస్టిక్‌ సామగ్రిని వృథా చేసే బదులు రీసైక్లింగ్‌ చేసి ప్రజలకు అవసరమైన సామగ్రిని తయారు చేయాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చలేదు. 2019లో మన ఊరు(పట్టణం)–మన ప్రణాళిక కార్యక్రమాన్ని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కార్యక్రమంలో భాగంగానే రీసైక్లింగ్‌కు అవకాశం ఉన్న ప్లాస్టిక్‌ సామగ్రిని జీపీల్లో సేకరించడానికి ప్రత్యేక యూనిట్లను ఏర్పాటు చేసింది. జిల్లాలో 530 జీపీలు ఉండగా చిన్న జీపీల్లో ఒక్కో సేకరణ కేంద్రం, పెద్ద పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా మూడు, నాలుగు ప్లాస్టిక్‌ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయించింది. ప్రతి గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్‌ సామగ్రిని వారం, పది రోజులకు ఒకసారి జిల్లా కేంద్రానికి తరలించి అక్కడి నుంచి రీసైక్లింగ్‌ కేంద్రాలకు చేరవేయాలని నిర్ణయం తీసుకుంది. ప్లాస్టిక్‌ సామగ్రిని తరలింపు, రీసైక్లింగ్‌ బాధ్యతను గత ప్రభుత్వం ఐటీసీ కంపెనీకి అప్పగించింది. ఆరంభంలో కొన్ని రోజుల పాటు ప్లాస్టిక్‌ సామగ్రి సేకరణ బాగానే కొనసాగింది. మళ్లీ ఈ కార్యక్రమం ముందుకు సాగలేదు. అనేక జీపీల్లో ప్లాస్టిక్‌ సేకరణ కేంద్రాలు మరుగునపడ్డాయి. సేకరించిన ప్లాస్టిక్‌ని తరలించడానికి దారులు మూసుకుపోవడంతో ఈ కార్యక్రమానికి మంగళం పలికినట్లు అయ్యింది.

ప్రభుత్వం దృష్టి సారించాలి..

ప్లాస్టిక్‌ వ్యర్థాలు వృథాగా పారవేయకుండా రీసైక్లింగ్‌ చేస్తే పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత ప్రభుత్వం నామమాత్రంగానే ఈ కార్యక్రమం నిర్వహించగా ఎవరికీ పట్టింపు లేకపోవడంతో మంచి కార్యక్రమం మరుగునపడింది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ప్లాస్టిక్‌ వ్యర్థాలను రీసైక్లింగ్‌ చేసే అంశంపై దృష్టి సారించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్లాస్టిక్‌ వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతినకుండా ఓ యజ్ఞంలా రీసైక్లింగ్‌ కార్యక్రమాన్ని కొనసాగించాలని పలువురు సూచిస్తున్నారు.

కాలుష్యం పెరుగుతుంది



ప్లాస్టిక్‌ వ్యర్థాలను వృథాగా పారవేస్తే కాలుష్యం పెరుగుతుంది. అవసరమైన సామగ్రిని రీసైక్లింగ్‌ చేయడానికి అవకాశం ఉంది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగించాలి. ప్లాస్టిక్‌ రీసైక్లింగ్‌తో మానవాళికి ఎంతో ఉపయోగం కలుగుతుంది.

– పెండెం శ్రీనివాస్‌, వద్యాట్‌

ప్రభుత్వం పునరాలోచన చేయాలి



పర్యావరణానికి ముప్పును తగ్గించే ప్లాస్టిక్‌ సామగ్రిని సేకరించి రీసైక్లింగ్‌ చేసే కార్యక్రమాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్లాస్టిక్‌ సామగ్రిని గతంలో మాదిరిగానే సేకరించాలి. ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్‌ సామగ్రిని సేకరణ కేంద్రాలకు చేరవేయాలి. – జక్కం అశోక్‌, మోర్తాడ్‌

అన్న మరణాన్ని తట్టుకోలేక..

- చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న జూనియర్‌ అసిస్టెంట్‌
- బస్వాపూర్‌లో విషాదచాయలు



శ్రీకాంత్‌ (ఫైల్‌)

భిక్కనూరు/ బీబీపేట: అన్నా.. చిన్నప్పటి నుంచి నన్ను చాలా గారాబంగా పెంచావు.. అమ్మా నాన్నల కంటే ఎక్కువ ప్రేమను పంచావు. నన్ను ఎవరేమన్నా ఊరుకునేవాడికి కాదు.. అలాంటి నీ మరణాన్ని నేను రెండు నెలలుగా తట్టుకోలేక పోతున్నా.. అందుకే నేనూ నీ దగ్గరికే వచ్చేస్తున్నా అంటూ ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం బస్వాపూర్‌ గ్రామానికి చెందిన మార్కంటి శంకర్‌, నాగరాణి దంపతులకు గణేశ్‌, శ్రీకాంత్‌ ఇద్దరు కుమారులు. గణేశ్‌ హైదరాబాద్‌లో ప్రైవేట్‌ ఉద్యోగం చేసేవాడు. శ్రీకాంత్‌(28) స్వగ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బీబీపేట తహసీల్‌ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గణేశ్‌ గతేడాది నవంబర్‌20న హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో ఉన్న అద్దెగదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో నాటి నుంచి శ్రీకాంత్‌ ఎవరితోనూ మాట్లాడడం లేదు. అన్న గణేశ్‌ను తలచుకుంటూ ప్రతిరోజూ బాధ పడేవాడని తెలిపారు. దీనికి తోడు కొన్ని నెలలుగా వేతనం రావడం లేదంటు చెప్పేవాడని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం విధులకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బీబీపేటలోని పెద్ద చెరువులో దూకి శ్రీకాంత్‌ ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. తరచూ అన్న మృతినే గుర్తుకు చేసుకుంటూ బాధపడే వాడని బీబీపేట, బస్వాపూర్‌ రైతులు పేర్కొన్నారు.



బీబీపేటలో మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

రెండు నెలల వ్యవధిలో..

రెండు నెలల వ్యవధిలో ఇద్దరు కుమారులు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు శంకర్‌, నాగరాణిల రోదనలు మిన్నంటాయి. తమకు తల కొరివి పెట్టే కొడుకులకు తానే తల కొరివి పెట్టాల్సి వస్తుందని అనుకోలేదంటూ తండ్రి చేసిన రోదనలు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించాయి. శ్రీకాంత్‌ అంత్యక్రియలు బుధవారం గ్రామంలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీబీపేట ఎస్సై అనిల్‌ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఓవర్సీస్‌ మ్యాన్‌పవర్‌ కంపెనీ లిమిటెడ్‌ (టామ్‌కామ్‌) జపాన్‌, జర్మనీలలో నర్సింగ్‌ ఉద్యోగ అవకాశాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్‌ మంగళవారం తెలిపారు. 22 నుంచి 30 ఏళ్ల వారు బీఎస్సీ నర్సింగ్‌/జీఎన్‌ఎం/ఏఎన్‌ఎం చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1.5 నుంచి రూ. 1.8 లక్షల వేతనం ఉంటుందని అన్నారు. ఇంటర్‌లో 60శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8919047600, 9573945684, 6302292450 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఆర్టీవో సీఐ సుభాష్‌ పేర్కొన్నారు. మంగళవారం ధర్మారం టోల్‌ ప్లాజాలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్టీవో మాట్లాడుతూ..రహదారిపై ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. పెద్దకొడప్‌గల్‌ ఎస్సై కోనారెడ్డి, టోల్‌ ప్లాజా ఆర్‌ఈ రెహమాన్‌ ఖాన్‌, తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువతో ఆయకట్టుకు నీరు

- బాల్కొండలో 1,529 ఎకరాలకు సాగు నీరు

బాల్కొండ : శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ మిగులు జలాలను సద్వినియోగపర్చే క్రమంలో భాగంగా వరద కాలువ ద్వారా యాసంగిలో కూడా నీటి విడుదలను చేపట్టారు. వరద కాలువ ఎస్సారెస్పీ మిగులు జలాలను సద్వినియోగపరుస్తూ నల్గొండ జిల్లాలోని 2.2 ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో నిర్మించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మారిన నీటి పారుదల అంశాలతో పాటు ఆయకట్టు స్థిరీకరణలో భాగంగా వరద కాలువ ద్వారా కూడా ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతుంది. వరద కాలువ ప్రాజెక్ట్‌నుంచి జిల్లాలో 28కి.మీ పొడవున కమ్మర్‌పల్లి మండలం వరకు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈమధ్యలో 9 తూములను, ఒక ఆనకట్టను నిర్మించారు. వీటిద్వారా 16 చెరువుల్లో నీరు నిండుతోంది. చెరువల ద్వారా 1,529 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ నాలుగు రోజుల నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టి చెరువలను నింపుతున్నారు.



కొనసాగుతున్న నీటి విడుదల..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుంది. వరద కాలువ ద్వారా 2వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 502 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270 క్యూసెక్కులు, ముంపు లిఫ్ట్‌ల ద్వారా 376 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 376 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌ నీటిమట్టం 1,083 (టీఎంసీ 60.91) అడుగులు ఉంది.

రాముడి కరెన్సీ నోటు విడుదల చేయాలి

- ఈస్టిండియా కంపెనీ పరిపాలనలో శ్రీరామ టంకాల చలామణి

కామారెడ్డి అర్బన్‌: అయోధ్యలో ఈనెల 22న శ్రీరామచంద్రుడి ప్రాణప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా ఆర్బీఐ, శ్రీరామచంద్రుడి ఫొటోతో రూ.500 కరెన్సీ నోటు విడుదల చేయాలని కోరుతూ పలువురు సామాజిక మాధ్యమాలలో షేర్‌ చేస్తున్నారు. అసలు నోటును పోలిన విధంగా శ్రీరామచంద్రమూర్తి ఫొటోతో రూ.500 నోటును డిజైన్‌ చేసి సామాజిక మాధ్యమాలలో షేర్‌ చేయడం, ఈ విషయం సామాన్యుల వరకు చేరిపోయింది. రిజర్వుబ్యాంకు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో జ్ఞాపకార్థంగా నాణేలు, కరెన్సీ ముద్రిస్తుంది. 500 సంవత్సరాల అనంతరం అయోధ్య రామమందిర పునఃప్రారంభం, శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ శుభ సందర్భంగా రిజర్వు బ్యాంకు ప్రత్యేక నోటు విడుదల చేస్తే కోట్లాది మంది శ్రీరామభక్తులు కొనుగోలు చేస్తారని అంటున్నారు. ఈస్ట్‌ ఇండియా కంపెనీ పరిపాలనలో శ్రీరాముడి టంకాలు ద్రవ్య వినియోగంలో చలామణిలో ఉన్న విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు.



షేర్‌ అవుతున్న శ్రీరామచంద్రుని రూ.500 నోటు నమూనా



అ'పూర్వ' సమ్మేళనం

బోధన్‌: సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్‌లో 2007–2008కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గాలిపటం కోసం పరుగెత్తి..

- ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డ బాలుడు
- విద్యుత్‌ సరఫరా నిలిపివేసి కాపాడిన ఆటో డ్రైవర్లు

బాన్సువాడ: తెగిన గాలిపటం కోసం వెళ్తూ ఓ బాలుడు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కరణ్‌సింగ్‌ అనే బాలుడు సోమవారం తెగిపోయిన గాలిపటాన్ని పట్టుకునే క్రమంలో రోడ్డుపై పైకి చూస్తూ పరుగెత్తుకుంటూ వెళ్లి కంచెలేని విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. ఒక్కసారిగా కరణ్‌సింగ్‌కు మంటలు అంటుకున్నాయి. అక్కడే ఉన్న ఆటో డ్రైవర్లు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు. దీంతో కరణ్‌సింగ్‌ కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, కడుపునకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు.

బాలికపై తండ్రి లైంగికదాడి

బీబీపేట: కంటికి రెప్పలా కాపాడాల్సిన ఓ తండ్రి సొంత కూతురిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన భిక్కనూరు పరిధిలోని ఓ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ తిరుపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మైనర్‌ బాలిక స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో చదువుతోంది. ఆదివారం సాయంత్రం తల్లి కూరగాయలు తీసుకొచ్చేందుకు సంతకు వెళ్లగా అదే సమయంలో ఇంటికి వచ్చిన తండ్రి కుమార్తెను బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. తల్లి వచ్చిన తర్వాత జరిగిన విషయాన్ని తెలుపడంతో స్థానికులతో సహాయంతో చితకబాది పోలీసులకు అప్పగించింది. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

చెట్టును ఢీకొని ఒకరి మృతి



దత్తు (ఫైల్‌)

వర్ని: చెట్టును ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జాకోర పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జాకోరకు చెందిన దత్తు(50) పని నిమిత్తం వర్నికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ దత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడి..

నవీపేట: మండలంలోని మహంతం గ్రామానికి చెందిన మేకల పోశెట్టి(70) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ మంగళవారం తెలిపారు. ఈనెల 14న బహిర్భూమికి వెళ్లిన పోశెట్టి ఇంటికి రాలేదు. కుటుంబీకులు చెరువు సమీపంలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


చికిత్స పొందుతూ ఒకరు ..

నిజామాబాద్‌రూరల్‌(జక్రాన్‌పల్లి): కుటుంబ కలహాలతో ఒకరు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన గొల్ల శోభన్‌(32) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి చెందిన శోభన్‌ శనివారం రాత్రి గడ్డి మందు సేవించగా గమనించిన కుటుంబీకులు ముప్కాల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడి శివారులో ఉన్న కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని కన్‌కల్‌ గ్రామానికి చెందిన ఎండీ హైమద్‌ తన బైక్‌పై కన్‌కల్‌ నుంచి కామారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కామారెడ్డి నుంచి తాడ్వాయి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న హైమద్‌ కిందపడడంతో కాలికి తీవ్రగాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గాయాలైన హైమద్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇటుక బట్టీ యజమానిపై కేసు



కేసు నమోదు చేస్తున్న అధికారులు

వర్ని: మండలంలోని హుమ్నాపూర్‌ శివారులో అనుమతులు లేకుండా ఇటుక బట్టీ నిర్వహిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు వర్ని డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ బాబు మంగళవారం తెలిపారు. సోమవారం ఇటుకల బట్టీని తనిఖీ చేయగా అక్రమంగా అటవీ ప్రాంతం నుంచి చెట్లను నరికివేసి బట్టీలో వాడుతున్నట్లు గుర్తించారు. దీంతో సదరు యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గురు రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.వివరాలిలా ఉన్నాయి.కాలనీలో నివాసం ఉండే గాజుల రాజ్‌కుమార్‌ ఇంటికి తాళం వేసి సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామానికి వెళ్లాడు. మంగళవారం తిరిగి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దేవునిపల్లి ఎస్సై రాజు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్‌ టీం బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లోని బీరువాలో దాచిన 2 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాంధారిలో పట్టపగలే..

గాంధారి: మండల కేంద్రంలోని దుర్గానగర్‌ కాలనీలో మంగళవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు ధ్వంసం చేసి చేసి చోరీకి పాల్పడ్డారు. ఆర్‌ఎంపీ డాక్టర్‌ నగేశ్‌ దుర్గానగర్‌లో నూతన ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. పిల్లల చదువుల నిమిత్తం వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నగేశ్‌ హైదరాబాద్‌కు వెళ్లాడు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు ఇంటి యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

వెంకటాపూర్‌లో చోరీ

వేల్పూర్‌: మండలంలోని వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన గంధం లక్ష్మి, గంధం లావణ్య ఇళ్లల్లో దుండగులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి పండుగ కోసం తాము కుటుంబ సభ్యులతో కలిసి పుట్టింటికి వెళ్లగా దొంగలు తమ ఇళ్లల్లో చోరీ చేసినట్లు తెలిపారు. రెండిళ్లల్లో రెండు బంగారు గొలుసులు, వెండి వస్తువులు అపహరించినట్లు చెప్పారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్‌: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కల్దుర్కిలో చోటు చేసుకుంది. రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి జయనంద్‌(40) కొన్ని రోజులుగా మద్యానికి అలవాటు పడ్డారు. ఈక్రమంలో అనారోగ్యానికి గురికావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కడుపునొప్పి భరించలేక ఒకరు..

భిక్కనూరు: కడుపునొప్పి, ఛాతినొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసుల శంకర్‌ (46) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా కడుపు, ఛాతినొప్పితో శంకర్‌ బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. సోమవారం సాయంత్రం సైతం కడుపు, ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ చెరువు కట్ట వద్ద శంకర్‌ చెప్పులు, దుస్తులు కనిపించడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా శంకర్‌ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య మాసుల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుల పట్టివేత



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సుధాకర్‌

రామారెడ్డి: ఓ మహిళకు మాయమాటలు చెప్పి నగదు దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ మంగళవారం తెలిపారు. పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. రెడ్డిపేట గ్రామానికి చెందిన గడీల బైరయ్య అతని భార్య భాగ్యలక్ష్మి ఈ నెల 11న రెడ్డిపేట సమీపంలోని పకీర తండా వద్ద ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళతో బైక్‌పై వచ్చి నమ్మకంగా మాటలు కలిపారు. భర్త చనిపోయిన వారికి తాము రూ. 40 వేలు ఇప్పిస్తామని, అందుకు గాను రూ. 6 వేలు ఖర్చు అవుతాయని నమ్మబలికారు. ఇది నమ్మిన సదరు మహిళ తన దగ్గర ఉన్న డబ్బులు తీసే క్రమంలో వీరు ఆమెను బెదిరించి నగదును ఎత్తుకెళ్లారు. దీంతో బాధితురాలు జగదాంబ తండాకు చెందిన బుక్య ధూళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో బైరయ్య, భాగ్యలక్ష్మిలను నిందితులుగా గుర్తించారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో వారు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

బోధన్‌రూరల్‌: సాలూర, బోధన్‌ మండలాల్లోని పలు గ్రామాల్లోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసినట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు సోమ, మంగళవారాల్లో బోధన్‌ మండలంలోని సంగం, ఊట్‌పల్లిలో పేకాట స్థావరాలపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 7వేల నగదు, సాలంపాడ్‌ క్యాంప్‌ వద్ద ముగ్గురు పట్టుకుని రూ. 11వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పెద్దమావంది శివారులో నిజామాబాద్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురికి చేయగా వారి నుంచి రూ. 20 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.